క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీహైస్కూల్లో వరల్డ్ ఆర్టిస్ట్ డే సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత ప్రముఖ ఆర్టిస్ట్ షేక్ అమీర్‌జాన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. చెట్లను పరిరక్షించే అంశంపై ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమీర్‌జాన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చెట్లను కాపాడాలనే అంశంపై పిల్లలకు అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సనత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్



సంగంలోని నేతాజీ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. 4,411 మందికి గానూ 4,191 మంది హాజరయ్యారు. నెల్లూరు నగరంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారు. వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు.

రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్



కొడవలూరు: మండలంలోని రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 109 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను వైద్యాధికారి జనార్దన్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామస్తులకు వరం లాంటిదన్నారు. హెచ్ఎస్ సురేంద్ర, ఎమ్మెల్‌హెచ్‌పీ రోజ్‌మేరీ, ఏఎన్ఎం సుమతి, హెచ్ఏ సురేష్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్

మనుబోలు: ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మడమనూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు జగదీశ్వరి కోరారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానికంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానంలో ఎలాంటి రోగాలకైనా చికిత్స ఉంటుందని తెలిపారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సంగం: సంగం–కలిగిరి రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. వివరాలు.. కలిగిరి వైపు నుంచి టాటాఏస్ వాహనాన్ని తీసుకొస్తున్న రికవరీ వ్యాన్‌ను వెనుక వైపుగా వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రికవరీ వ్యాన్‌తో పాటు టాటాఏస్ వాహనం పాక్షికంగా దెబ్బతిన్నాయి. కారులోని వ్యక్తి స్వల్ప గాయాలవగా ఆస్పత్రికి తరలించారు. సీఐ వేమారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కలుషిత నీటితో చేపల మృత్యువాత

అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్ కోనేరులోని చేపలు శుక్రవారం మృత్యువాత పడ్డాయి. దాదాపు టన్నుకుపైగా చేపలు చనిపోయిపైకి తేలాయి. కలుషిత నీటి కారణంగా చనిపోయి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. చేపలను అలాగే వదిలేస్తే దుర్గంధం వెదజల్లే పరిస్థితి ఉన్నందున నగర పంచాయతీ అధికారులు స్పందించి చనిపోయిన చేపలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

ఎప్పుడు పూర్తవుతుందో..?

- వర్షాలొస్తే పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు
- దశాబ్దాలుగా సమస్య
- గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు
- కొత్త ప్రభుత్వంలో ఆగిన పనులు
- రాకపోకలకు అంతరాయం



పొంగి ప్రవహిస్తున్న వాగును దాటుకుంటున్న గ్రామస్తులు (ఫైల్)

పొదలకూరు: నావూరు పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని ఎదురు చూస్తున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. అవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియక గ్రామవాసులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షం కురిస్తే వాగు పొంగి ప్రవహించి జనజీవనం స్తంభించిపోతుంది. నాలుగు ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఈ సమస్య దశాబ్దాలుగా ఉన్నా ఎప్పుడు ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టుపట్టి బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలకు సైతం రాకపోకలు స్తంభించాయి. ఇవి పూర్తయితే మండలంలోని చెన్నారెడ్డిరెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, చేజర్ల మండలం కొండలరాయుడుకండ్రిక తదితర గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుంది. అయితే కొత్త ప్రభుత్వంలో బిల్లులు వ్యవహారంలో లెక్కలు చూడాల్సి రావడంతో జాప్యం నెలకొందని అధికారులు వెల్లడిస్తున్నారు. పీఎంజీఎస్వై కింద చేపడుతున్న పనులకు తాత్కాలికంగా మాత్రమే బిల్లులు నిలిచిపోయాయని, తిరిగి త్వరలో ప్రారంభిస్తారంటున్నారు.

నిర్మాణానికి రూ.3.62 కోట్లు

దివంగత సుందరరామిరెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నావూరు పెద్దవాగుపై చప్టాను నిర్మించారు. నాలుగు దశాబ్దాల క్రితం రాకపోకలు ఇంత పెద్దఎత్తున జరిగేవి కాదు. ఫలితంగా వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలు వాగు పొంగినా ఇళ్ల వద్దనే ఉండేవారు. అయితే ప్రస్తుతం రాకపోకలు పెరిగి కాలేజీలు, పాఠశాలలకు వెళ్లేవారు, ఉద్యోగాలు చేసేవారు సంఖ్య పెరిగింది. దీంతో నిత్యం వాగు మీదుగా వెళ్లాల్సిందే. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో రెండు, మూడురోజులు వాగు పొంగి రాకపోకలకు ఆటంకం కలిగితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అప్పటి మంత్రి కాకాణి సమస్యను గుర్తించి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.62 కోట్లు నిధులు మంజూరు చేయించారు. సంగం – పొదలకూరు మెయిన్‌రోడ్డు నుంచి కొండలరాయుడుకండ్రి వరకు రోడ్డు నిర్మాణానికి మరో రూ.10.83 కోట్లు కూడా మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. పనులు కొంతవరకు జరిగినా బ్రిడ్జి నిర్మాణం కోసం కల్వర్టు పైపుల ద్వారా డైవర్షన్ కూడా పూర్తి చేశారు. అయితే ఎన్నికల అనంతరం జాప్యం నెలకొంది. వాగు పొంగితే ప్రత్యామ్నాయ మార్గం కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా మారింది.



నావూరు పెద్దవాగు చప్టా పక్కన డైవర్షన్ రోడ్డు

ఏం చెబుతున్నారంటే..

దీనికి సంబంధించి అధికారులు ఇలా చెబుతున్నారు. వర్షాకాలం తర్వాత బ్రిడ్జి పనులు చేపట్టడం జరుగుతుందని వెల్లడిస్తున్నారు. ప్రభుత్వం మారడంతో నిధులకు సంబంధించిన లెక్కలు పరిశీలిస్తున్నారని, పనుల్లో కొంత జాప్యం జరిగినా ఆపే ప్రసక్తి లేదంటున్నారు. బీటీ వేస్తే పనులు పూర్తవుతాయని, ప్రస్తుతం బిల్లులు ఆగి ఉన్నందున పనులు మందగించాయని చెబుతున్నారు.

బ్రిడ్జి పనులు పూర్తి చేస్తే మేలు



పెద్దవాగుపై బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేస్తే మాకు మేలు కలుగుతుంది. ప్రభుత్వం మారిన తర్వాత పనుల్లో జాప్యం నెలకొంది. వర్షాకాలంలో వాగు పొంగిపొర్లితే నావూరు పాఠశాల వరకు నీరు వచ్చి చేరుతోంది. ఫలితంగా నాలుగు గ్రామాల ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. వెంటనే పూర్తి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

– ఎన్.బాలకొండారెడ్డి, చెన్నారెడ్డిపల్లి

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్సై హనీఫ్

పొదలకూరు: కళాశాలల్లో ఈవ్‌టీజింగ్, రాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్‌కే హనీఫ్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నేరాలకు పాల్పడితే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. యువత సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మహత్యకు పాల్పడవద్దన్నారు. మాదకద్రవ్యాల క్రయ, విక్రయాలకు పాల్పడితే సమాచారం అందజేయాలన్నారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, అవసరం లేని లింక్‌లపై క్లిక్ చేయొద్దని సూచించారు. సమావేశంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై హనీఫ్

ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌నకు వీఎస్‌యూ విద్యార్థి

వెంకటాచలం: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రీ రిపబ్లిక్‌డే క్యాంప్‌నకు విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ – 4కు చెందిన సీహెచ్ ప్రసాద్ అనే వలంటీర్ ఎంపికయ్యాడు. కళాశాలలో ఆర్గానిక్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతున్న ప్రసాద్‌ను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ – 4 ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు శుక్రవారం అభినందించారు.



ప్రసాద్‌తో ఇన్‌చార్జి వీసీ తదితరులు

గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ

కోవూరు: సీజన్‌కు అనుకూలమైన వరి వంగడాలను వేసుకోవాలని నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థాన సీనియర్ శాస్త్రవేత్త శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నార్లను నవంబర్ 15 తర్వాత పోసుకోవాలని చెప్పారు. పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. నెల్లూరు జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీమాధవి, వ్యవసాయాధికారి గీతామాధురి, శ్రీకాంత్, శ్రీశాంతి, కవిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న బ్రిజిత

కొడవలూరు: వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ అధికారుల సహకారంతో నీళ్ల ట్యాంక్‌లు, బావుల్లో క్లోరినేషన్ చేయించాలని కోరారు. గ్రామాల్లో దోమలు ప్రబలకుండా మలాథియాన్‌ను స్ప్రే చేయడంతో పాటు దోమల బారిన పడకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు రామకృష్ణ, బాలచంద్రబాబు, సీహెచ్ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏలు షఫీఉద్దీన్, సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

29న రక్తదాన శిబిరం

పొదలకూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సందర్భంగా ఈనెల 29వ తేదీన స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సీఐ, ఎస్సైలు రాంబాబు, హనీఫ్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరుగుతుందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాగితాలపూరులో గ్రామసభ

మనుబోలు: మండలంలోని కాగితాలపూరులో శుక్రవారం రీసర్వే గ్రామసభ జరిగింది. దీనికి డీఎస్ఎల్ఓ నాగేశ్వర్ విచ్చేసి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వినతిపత్రాలు అందజేస్తే వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. తహసీల్దార్ సుబ్బయ్య, రీసర్వే డీటీ మంజుల, సర్వేయర్‌లు శ్రీనివాసరావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పిడతాపోలూరులో పశు వైద్యశిబిరం

ముత్తుకూరు: మండలంలోని పిడతాపోలూరులో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండవ ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ శ్రీనివాసులునాయుడు పశువులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. మినరల్ మిక్చర్ లాభాలు వివరించారు. గోపాలమిత్రలు డి.వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్, రమణయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సత్కారం



విడవలూరు: ఎంపీడీఓ నగేష్‌కుమారిని గాదెలదిన్నెకు చెందిన మాజీ సర్పంచ్ కాగొల్లు చిన్నమస్తానయ్య మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆమెను సత్కరించారు. వైస్ సర్పంచ్ ఈదూరు మల్లి, హరిబాబు, పవన్‌కుమార్, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో తనిఖీ



ఇందుకూరుపేట: స్థానిక ఉర్దూ పాఠశాలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్ శుక్రవారం పరిశీలించారు. నోట్ బుక్స్, వర్క్ బుక్ తదితరాలను పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు సైరా బాను, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి

- పశు వైద్యాధికారి గురవారెడ్డి



రైతులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించిన గురవారెడ్డి

మనుబోలు: పశుగణనకు పాడి రైతులు సహకరించాలని మనుబోలు పశు వైద్యశాల ఏడీ డాక్టర్ గురువారెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పాడి రైతు పచ్చిపాల రామిరెడ్డి ఇంటి వద్ద పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ 2025 సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీ వరకూ జరిగే 21వ పశుగణన జరుగుతుందన్నారు. దీని ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువులకు బడ్జెట్ కేటాయించి వాటి పునరుత్పత్తికి తోడ్పడతాయని తెలిపారు. అధికారులు ప్రతి గడపకు వెళ్లి పశువుల వివరాలు సేకరిస్తారన్నారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, గాడిదలు, కుక్కలు, కుందేళ్ల, పక్షిజాతికి చెందిన కోళ్లు, బాతులు తదితరాల సమగ్ర సమాచారాన్ని అందించాలని కోరారు. ఆయన వెంట మాజీ గణాంకాధికారి గౌతమి, సిబ్బంది హమీద్ తదితరులున్నారు.

పోలీసుల సమక్షంలో రికార్డుల అప్పగింత

పొదలకూరు: పొదలకూరు పంచాయతీ రికార్డులను పోలీసుల సమక్షంలో పూర్వ కార్యదర్శి దొరబాబు శుక్రవారం అప్పగించారు. పంచాయతీకి కార్యాలయం లేకపోవడంతో పట్టణంలోని ఒకటో సచివాలయంలో రికార్డులను ఉంచారు. ఇటీవల పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా భవన నిర్మాణం పూర్తి కావడంతో అందులోకి పంచాయతీ నిర్వాహకులు సెక్రటరీ అనుమతితో తరలించారు. అంతేకాక పంచాయతీ పారిశుద్ధ్యానికి సంబంధించిన సామగ్రిని అదే భవనంలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీకి చెందిన కొందరు భవనాన్ని పంచాయతీ కార్యాలయంగా ఉపయోగించేందుకు వీలులేదని రికార్డులను అధికారుల అనుమతి లేకుండా తరలించారని పోలీసులు, ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. అంతేకాక భవనానికి తాళం వేయడంతో పంచాయతీ నిర్వాహకులు తమ సామగ్రి భవనంలో ఉన్నాయని వారు మరో తాళం వేశారు. ఈ వివాదం పదిరోజులుగా నెలకొనడంతో పట్టణంలో పారిశుద్ధ్య సమస్య కూడా ఏర్పడింది. అయితే పూర్వ సెక్రటరీ రికార్డులను తనకు అప్పగించకుండా వెళ్లారని ప్రస్తుత సెక్రటరీ శ్రీనివాసులు పేర్కొనడంతో ఎలాంటి వివాదాలు చోటుచేసుకోకుండా పోలీసుల సమక్షంలో రికార్డులను అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యులు, మీడియాను పోలీసులు భవనంలోకి అనుమతించలేదు. రికార్డులను కొత్త భవనంలోనే ఉంచాల్సిందిగా వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రసన్నకు శుభాకాంక్షల వెల్లువ







కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పలువురు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. బుచ్చిరెడ్డిపాళెం కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ మేనకూరు సీతారామిరెడ్డి, కౌన్సిలర్లు యానాదిరెడ్డి, మల్లారెడ్డి, మోర్ల జయంతి, కంటా అనంతమ్మ, వార్డు ఇన్‌చార్జీలు మోర్ల భరత్, కంటా ప్రసాద్‌రావు, నేత ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని చెల్లాయపాళేనికి చెందిన పార్టీ నేతలు కనిసిరి వెంకయ్య, తన్నీరు ఆదిశేషయ్య నరేష్ రాచగిరి, మణి, వినయ్, అభిలాష్, నవీన్, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, చాణిక్య, బుచ్చిరెడ్డిపాళెం పట్టణ నేత చిన్న అల్లాబక్షు శుభాకాంక్షలను తెలియజేశారు.

ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అభినందనలను తెలియజేశారు.

తాగునీరు రావడం లేదు సారూ..



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గిరిజనులు

- గిరిజనుల ఆందోళన

మనుబోలు: మండలంలోని పిడూరు గ్రామం గిరిజన కాలనీ వాసులు తాగునీటి కోసం శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 15 రోజులుగా పంచాయతీ కుళాయిల నుంచి తాగునీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందదన్నారు. దీంతో కూలి పనులకు వెళ్లలేకపోతున్నామని వాపోయారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అంకయ్య మాట్లాడుతూ తాగునీరు సరఫరా చేసే మోటార్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల చెడిపోయిందన్నారు. కొత్తది ఏర్పాటు చేస్తున్నామని తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ

కోవూరు: బెంగళూరులో నిర్వహించిన సౌత్ జోన్ ఆర్చరీ పోటీల్లో గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల అనుబంధ పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ సంవత్సర ఈసీఈ విద్యార్థి ఆదినారాయణ ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థిని శుక్రవారం అభినందించిన అనంతరం కోశాధికారి విజయశంకర్‌రెడ్డి మాట్లాడారు. ఉత్తరాఖండ్‌లో డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. కళాశాల పీడీ ఆశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి అభినందన

ఔషధ శాస్త్రంలో ఏఐపై పుస్తకావిష్కరణ

కొడవలూరు: ఫార్మకాలజీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై పుస్తకాన్ని నార్నురాజుపాళెంలోని వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాధవీలత రచించారు. దీన్ని కళాశాలలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం చైర్మన్ గుణశేఖర్ మాట్లాడారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఔషధ రంగంలో ఎలా ఉపయోగించాలి.. ఔషధ నియంత్రణ, రక్షణపై ఈ పుస్తకంలో సమగ్రంగా వివరించారని చెప్పారు. ఏఓ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

విడవలూరు: గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని వావిళ్లలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతి పంచాయతీలో గ్రామసభలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. వీఆర్వో కుమార్, సర్వేయర్ బాషా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను అందజేస్తున్న గ్రామస్తులు